ఎ.ఆర్.రెడ్డి మెమోరియల్ కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# పూల పిల్ల

- పి. చంద్రశేఖర ఆజాద్

**చూపు మరల్చలేని నిస్సహాయత. కళ్ళు మాత్రమేనా చూస్తోంది. మనసంతా పరుచుకొంటున్న గులాబీల జ్ఞాపకాలు...**



మల్లెపూల పరిమళం... ఎక్కడ ఆగితే అక్కడ ఒక్కో మధుర ఘట్టం.

ఇంకేమాత్రం అది మారుతీ కారు కాదు. పూల పడవ. ఎందరు, ఎన్నిగంటల శ్రమకోర్చి అలంకరించారో తెలీదు!? ఇంత అపురూపదృశ్యాన్ని కళ్ళముందు నిలిపినందుకు ఎన్ని అభినందనలకైనా అర్హులు...".

"అలా నడుద్దామా" అన్నాడు చిట్టిబాబు.

వాడు నా తమ్ముడు. దాదాపు ఎనిమిది నెలలైంది మేం కలుసుకొని, ఉదయం ఆరుగంటలకి వాడింకా లేవకముందే మంచం మీద కూర్చుని కళ్ళలోకి చూస్తూ, 'చిట్టీ' అంటున్న అన్నయ్యను చూసి 'ఎప్పుడొచ్చావ్' అంటూ లేస్తున్నప్పుడు... ఇలానే... పువ్వుల్లా నవ్వటం...

"చెప్పకుండా వస్తే ఎలా. ఈ రోజు ఫొటోలు తీయాల్సిన పని వెళ్ళాలి" టిఫిన్ చేస్తున్నప్పుడు అన్నాడు.

"నువ్వే కాదు. నేనూ వెళ్ళాలి. సరిగ్గా రేపు ఉదయం ఇదే టైముకి బస్ ఎక్కి నగరం చేరుకోవాలి అక్కడో మిత్రుడి స్కూల్ పదో వార్షికోత్సవంలో పాల్గొని అక్కడనుండి నల్లూరు వెళ్ళి ప్రసాద్‌ని కలిసి... రాత్రి హైదరాబాద్ బస్సెక్కాలి".

"ఫర్వా లేదు నేను త్వరగా ఫొటోలు ముగించుకొని వస్తా... రాత్రంతా కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు.

నేను కనిపిస్తే చాలు వాడు బాల్యంలోకి జారిపోతాడు. మా స్నేహితుల గురించి... మా మైదానాల గురించి... మా తగాదాలు... ఒకటా... రెండా... వాడి కూతురుని పక్కన కూర్చోబెట్టుకొని అన్నీ చెబుతాడు. 'అవునా పెద్దనాన్నా?' అంటుంది సంధ్య. నేను నవ్వుతూంటాను.

"కబుర్లు చెప్పుకోవచ్చు గానీ ఈలోగా మనం చేయాల్సిన పని ఇంకోటుంది. అది పెళ్ళికి వెళ్ళి రావటం".

"పెళ్ళా? ఎవరిది?" అన్నాడు.

"లలితక్క వాళ్ళమ్మాయిది".

వాడు అదోలా ముఖం పెట్టాడు వెంటనే లలితక్క అర్థం కాక. మాకు మొత్తం ఆరుగురు బాబాయిలు, నలుగురు మేనత్తలు. వారికి ఎందరు పిల్లలో. ఆ తర్వాతి తరం ఎలా విస్తరించిందో వాడికంటే రెండేళ్ళు పెద్దయిన నాకే తెలియదు. మా రెండో బాబాయి గారి పెద్దమ్మాయి

లలిత. వాళ్ళ అమ్మాయి పెళ్ళి... విజయవాడ దగ్గర వుంటున్నారు. పెళ్ళి గుంటూరులో.

ఇరవై అయిదు సంవత్సరాలక్రితం నాన్న మరణంతో దాదాపు సంబంధాలు తెగిపోయాయి.

ఈ సంవత్సరాల న్నింటా పగిలిన అద్దం ముక్కల్లా ఆంధ్ర దేశమంతటా అందరూ చెదిరిపోయారు.

కొందరు వేరే రాష్ట్రాల్లో, దేశాల్లో కూడా వున్నారు. ఎవరెవరో తెలియదు.

శుభలేఖలు వచ్చినప్పుడు 'అమ్మ' మాత్రం వారి గురించి చెబుతుంటుంది. మేమే మొత్తం అయిదు మందిమి. అందరిలోకీ చిన్నవాడు చిట్టిబాబు. వాడికీ నాకూ కూడా చాలామంది తెలీదు.

ఈ పెళ్ళికి తప్పకుండా వెళ్ళమని అమ్మ చెప్పింది అందులోనూ 'చిట్టి'గాడి పెళ్ళికి లలితక్క వచ్చింది. అందువల్ల వాడు హాజరు కావాలని.



ఈ విషయాలన్నీ చెప్పాక...

"నేను రాను బాబూ, కావాలంటే నువ్వు వెళ్ళు... నాకు శుభలేఖ కూడా అందలేదు" అని తప్పించుకొన్నాడు.

"అదేం కుదరదు. అమ్మ ఆర్డర్. ఇదిగో శుభలేఖ. 'స్త్రీలకు ప్రయాణం' అని చిన్న కార్డు కూడా పెట్టారు. అంటే కుటుంబ సమేతంగా - మీ అమ్మాయి, భార్య కూడా బయలుదేరాలి".

"ఇంతకూ ఎన్నింటికి పెళ్ళి"

"తెల్లవారు ఝాము మూడు గంటలకి".

"సమస్యే లేదు. అమ్మ కాదు భగవంతుడు చెప్పినా రాను నేను నిద్రకాగలేను" అన్నాడు.

"చెప్పేది వినాలి నేను కూడా అట్లిందాకా వుండను. కార్డ్ చూడు. సాయంకాలం 7 గంటలనుండి డిన్నర్ ఆరంభం అన్నారు. అంటే మనం తెనాలిలో అయిదున్నరకి బయలుదేరితే ఏడు గంటలకీ గుంటూరు చేరతాం. అర గంటలో అందరినీ పలకరించి... పావుగంటలో భోంచేసి తిరిగి తొమ్మిది గంటలకల్లా బస్‌స్టాండ్‌కి చేరుకుంటాం. పదకొండుకి ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇంట్లో ఉంటాం".

"నువ్వట్లాగే అంటావు. ఇది జరిగేది కాదు. రాక రాక వచ్చావు. పప్పు భోజనం నేను పెట్టిస్తా . ఇక్కడే తన్నీ కబుర్లు చెప్పకుందాం" అన్నాడు.

"ఏడ్వాప్‌లే. రేపు నీ అమ్మాయి పెళ్ళికి వాళ్ళంతా రావద్దా? అమ్మ మరీ మరీ చెప్పింది" అన్నాను.

"నువ్వెప్పుడూ ఇంతేనయ్యా లక్ష పనులు పెట్టుకొని వస్తావ్" అన్నాడు చిరుకోపంతో వాడలా అలిగితే బాగుంటుంది.

మొత్తం మీద వాడిని అంగీకరింపచేసి తన్తో కలిసి స్టూడియోకి వెళ్ళి... అయిదు గంటల లోపు వచ్చి స్నానం చేసి ఇద్దరమే బయలు దేరాం.

గుంటూరు స్టేషన్‌లో దిగాక తెలిసింది సిటీబస్సులు బంద్.. మేం జె.కె.సి. కాలేజీ దగ్గర కళ్యాణమండపానికి వెళ్ళాలి! అప్పటికి సమయం ఏడు గంటలు రిక్షా అయితే ఇంకో గంట. ఆటో వాడు 30 రూపాయలడిగాడు ఏం చేస్తాం. అందులోనే బయలు దేరాం. దారి పొడుగునా రంగు రంగుల లైట్లు...

"సిటీలో చాలా వివాహాలు జరుగుతున్నాయి.

ముందు ఏ కళ్యాణ మండపమో తెలీదు. ఎక్కడో చోట భోంచేసి వెళ్దాం పద అన్నాడు తమ్ముడు. అప్పటికే వాడికి నేను చెబితే విన్లేదు అన్న భావం వచ్చేసింది. వీటన్నింటికీ మంచి దారిలో టిఫిన్ చేద్దామంటే వీల్లే దన్నాను. వెళ్ళగానే భోంచేయటం... వెనక్కి తిరగటమే నన్నాను.

మొత్తమ్మీద వధూవరుల పేర్లు శుభలేఖలోవివే కాబట్టి ధైర్యంగా వెళ్ళాం.

అందరూ కొత్త. కొందరు విచిత్రంగా చూస్తున్నారు. మరి కొందరు పోలికలు వెతుక్కుంటున్నారు. ఇంకొందరు గుసగుసలాడుకుంటున్నారు.

'చిట్టి'గాడయితే ముఖాన చిరునవ్వు పులుముకొని 'పెళ్ళి కూతురు' కంటే సిగ్గు పడుతున్నాడు.

నేనే ధైర్యం చేసి అక్క గురించి అడిగాను 'పైనుంది... మీరెవరూ గుర్తు పట్టలా' అన్నాడో ముసలాయన...

"ఓరీ... లక్ష్ముడు కొడుకువా... నువ్వెన్నో వాడివి మీ అమ్మ రాలేదే... రావొచ్చుగా... ఆరోగ్యం బాగుందా...?" అంటూ ప్రశ్నల్తో చంపేశాడు.

చిట్టిగాడిని పరిచయం చేసినపుడు " ఈ అబ్బాయి ఎప్పుడు పుట్లాడు నాకు తెలియదు" అన్నాడు.

"వీడికో అమ్మాయి పుట్టింది" అన్నాను.

"నాకు తెలియదు. వయసొచ్చిందిగా గేపకం వుంటటంలా" అంటున్నాడు.

చిట్టిగాడు వెనుకనుండి గిల్లుతున్నాడు... అయన్ని తప్పించుకొచ్చాం.

"నువ్వట్లా ఒక్కొరితో ఫ్లాష్‌బ్యాక్‌కెళ్తే ఇటు నుండి హైదరాబాద్ వెళ్ళాల్సిందే" అన్నాడు.

"లలితక్కను వెదుక్కుంటూ వెళ్ళాం. మా యిద్దరినీ చూడగానే ముఖం చేటంత చేసుకొని 'వచ్చేశారా?' అంది.

'అదేంటిరా... రమ్మంది వాళ్ళేగా' అన్నాడు మెల్లగా.

అప్పటినుండి మొదలు... మహాకంగారు పడిపోయింది. మా యిద్దర్ని లోక్కెళ్ళి కూతురుకి చూపించి ఏదో చెప్పింది. వాళ్ళాయనకి, అత్తకి, మావగారికి... ఇంకా మాకు తెలియని వారికి... వేపాల్ వాళ్ళు స్వెట్టర్లు అమ్మటానికొచ్చినప్పుడు ఆ ముక్కుల్లూ, కళ్ళకేసి చూసినట్లు చూస్తున్నారు.

"అమ్మ రాలేదు. మీ ఆవిడ రాలేదు. పిల్లలూ రాలేదు. ఇట్టయితే ఎట్లా... అందరం దూరమైపోతున్నాం. సంబంధాలు కలుపుకోవాలి. ఏమిటోరా... అనుకోకుండా అయిపోయింది" అంది చివరిగా.

అక్క మాటల సారాంశం ప్రకారం పిల్లకు పద్దెనిమిది మాత్రమే దాటినా పిల్లాడు అనుకోకుండా దొరికాడు మంచివాడు. అమ్మ మాత్రమే ఉంది. లెక్చరర్ ఉద్యోగం. కట్నంగా దాదాపు ఏడు లక్షలు... అది కాక బంగారం! ఏమిటో అనుకోకుండా అయిపోయింది.

"చిట్టీగాడు ఇంక ఆ మాటని వదలడు. ఏ పెళ్ళయినా అదే పందిరంతా తిరుగుతుంటుంది."

"అయ్యో... అక్షింతలు వేయకుండా వెళ్తారా... అవున్లే... తెల్లవారగట్ల పెళ్ళి కదా. భోంచేయకుండా వెళ్ళొద్దు... ఆకుకి ఇరవై అయిదు రూపాయలు... ఏమిటో ఎన్ని ఖర్చులనుకుంటున్నారు..." అని ఎవరో పిలిస్తే అటు వెళ్ళింది.

"ఇంక పద" అంటూ నెట్టుకొచ్చాడు.

"పెళ్ళి తెల్లారగట్ల చేయమదెవరయ్యా... పెళ్ళి కొడుకు నిద్రపోకుండా చూసుకోవాలి. ఇస్తరాకు పాతికరూ. మనం భోంచేయకుండా వెళ్తే ఎళ్లై అదా... ఫాదాశ్లా" అన్నాడు.

"అమ్మతో చెబుతా" అన్నాను...

"ఓ పక్క కెమెరాలు తీసుకుని యిద్దరు కుర్రాళ్ళు తిరుగుతున్నారు.

ఓ పిల్లవాడు ఏడుస్తున్నాడు.

వీడియో లైటింగ్ ఏర్పాట్లు చూస్తున్నారు.

ఇంకో పక్క హాల్లో కళ్యాణ మండపానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇంకా పెళ్ళి కొడుకు రాలేదు. తీసుకురావడానికి బావమరిది వెళ్ళాడు.

"మేం బయట నిలబడ్డాం... భోజనాలు ఏడింటికి అన్నారు గాని మొదలవ్వలేదు." పెళ్ళి కొడుకు రావాలేమో మరి... కళ్యాణ మండపం కింద హాల్లో ఆకులు పరిచారు. సప్లయర్లు కనిపిస్తున్నారు. పెద్ద వానసలేం రావటం లేదు. మాలాగానే చాలా మంది నిరీక్షిస్తున్నారు

"భోంచేయకుండా వెళ్తే అక్కా వాళ్ళు బాధపడతారని కాకుండా ఇంట్లో ఏమీ వండరనే బాధ..."

"ఆకలిగా వుంది" అన్నాడు చిట్టీ.

"ఓర్చుకో... అందులోనూ ఆకురేటున లెక్క. పాతిక తీసుకుంటున్నప్పుడు కూలి గిట్టించుకోవాలి" అన్నాను. నిజం చెప్పాలంటే నాకూ ఆకలిగా వుంది.

"అప్పుడు వచ్చిందా కారు... అలా మెత్తగా జారి... ముందుకి దూకి ఆగింది. ఎవరో పరిగెత్తారు పైకి... కొందరు లేచారు. భోజనాలు మొదలయ్యాయని కెమెరా క్లిక్కుమంది. వీడియో లైట్లు వెలిగాయి... కారు తలుపులు మాత్రం తెరుచుకోలేదు.

ఇంతలో లలితక్క వస్తోంది. అసలే స్థూలకాయం. పైగా బీ.పి.! ఏ మాత్రం ఆందోళనను తట్టుకోలేదు. చెప్పులుతుతే సంపాదించాలు గాని. తనవరకి ఇంకా పనికటి పద్ధతులూ, మావూరి ప్రత్యేకమైన భాషా మారనే లేదు.

చిట్టీగాడు కొంచెం రిలీఫ్ ఫీలయ్యాడు గాని అది ఎంతో సేపు నిలవలేదు.

వీడియోగ్రాఫర్‌కి విసుగు పుట్టి కొంచెంసేపు మమ్మల్నే కొరుపి తీసి... ఆగిపోయాడు.

అతనెందుకు కారు దిగటం లేదో తెలియదు.

అడగటానికి అంత పెద్ద చనువు లేదు. అప్పుడు... కారుకేసి చూస్తే...

'కరుణశ్రీ' బతికిన క్షణాలిక్కడే కదూ... పూల విలాపాల్ని వినగలిగి, మహానుభావుడు... ఒక్కో పువ్వు నుండీ కరుణశ్రీతో పాటూ ఘంటసాల వారూ... ఆ గీతం... పరిమళం... ఎటు చూస్తే అటు పరుగులు తీస్తున్న పిల్లలు...! ఇప్పుడు... ఆ మహానీయులిద్దరూ లేరు... కానీ పువ్వులున్నాయి... పువ్వులున్నంత కాలం వారిద్దరూ ఉంటారు...!

పూలు విలపిస్తాయో లేదో తెలియదు.

కానీ... దరహాసంతో వికసించ గలవు.

రెండు జీవితాలు ఏకంగా మారే వేళ సాక్ష్యాలుగా, జ్ఞాపకాలుగా, తరతరాలుగా పూలు...! భగవంతుడినీ, మనిషినీ ఏకకాలంలో అనుభూతింపచేసేవి పూలు...!

సృష్టి ఎంత చమత్కార భరితం!

మేం నడుస్తున్నాం.

"అది కాదన్నాయ్. ఇప్పట్లో అయ్యేట్లు లేదు. సిటీ బస్‌లు లేవు. ఇక్కడ ఆటోలు దొరకవు. లాస్ట్ బస్ తొమ్మిదీ, పదీ మధ్యన ఉంది. తర్వాత మన తిప్పలు తిప్పలు కాదు"


"అయిపోయింది. ఇంతదూరం వచ్చి ఏమీ తినకుండా వెళ్ళటం బాగుండదు"

"వాళ్ళు చూడొచ్చారా? అయినా మనుషులు సంబంధాలు ఎప్పటికప్పుడు తెంచేసుకుంటున్నారు. నాన్న చచ్చిపోయాక ఒక్కరూ మనింటికేసి తొంగి చూడలేదు. అసలు రెండు ముద్దలు తింటున్నారా లేదా అనడగలేదు. ఎందుకన్నయ్యా... ఇలాంటి బంధాల్ని కాపాడుకోవాలంటావా?"

"నాన్న గుర్తొచ్చాడు కాబోలు. వాడి కంఠంలో జీర. వాడి ఆవేదన నేను అర్థం చేసుకుంటాను." చాలా సంవత్సరాల క్రితం... నాన్నని కుర్చీలో కూర్చోపెట్టినపుడు ఆయనమీదకి చల్లినపూలు... వేసిన దండలు... రాలిపోయి చుట్టూ పోగుపడ్డ పూల మొక్కలు...

మేమేవా ఏడ్చింది... పూలన్నీకదూ... తుది వీడ్కోలు పలుకుతూ... ప్రతి సందర్భంలో పూలే... కన్నీళ్లూ అంతే... దు:ఖంలోనూ మహానుభూతిలోనూ... పూలు గాలికి రాలిపడ్డట్టు జలజలా జలపాతాలు...

వాడి ప్రశ్నకి జవాబు తెలియదు అంతలోతుగా ఆలోచించాల్సిందీకాదు. కొన్ని మనచేతుల్లో ఉండవు. సంబంధాలు గాఢతరం అయితే భోంచేసి వెళ్దామనగలనా!




వి. బాబాజి (కమ్యూనిస్ట్), కురబలకోట, చిత్తూర్ జిల్లా - 517 350.

అపలేమీ లేకుంటే భోంచేయటం అవసరమా?

"ఓ షాపు ముందాగాం. వాడు ఓ చిన్న బిస్కట్ అందిర్ఛాధు. తర్వాత ఓ కూల్‌డ్రింక్ కాదనలేదు. మౌనంగానే నడిచాం. ఇంకా కారు అలానే ఉంధి. ఏం జరిగిందో తెలియదు. కట్నం సమస్యా? బ్రాహ్మణుడి సమస్యా? ఇంకెవరన్నా కావాలా? అభిప్రాయబేధాలా? ఏమో? ఎలా తెలుస్తాయి ఇలా నిలబడితే?

చిట్టి తిరిగి అన్నాడు...

"అన్నయ్యా... ఇంతకీ సమస్య ఏమిటో...?"

నా దృష్టి అటు లేదు. ఎవరికి వారు ఆందోళనతో తిరుగుతున్న వేళ... కారు నుండి ఇంకా పెళ్ళికొడుకు గాలిరాక వినురుకుంటున్న క్షణాల్లో... నా కళ్ల ముందు...

"బెరుగ్గా చూస్తూ ఆపిల్ల... మెల్లగా అతి మెల్లగా వచ్చింది. ఎవరూ తనని గమనించటం లేదనుకున్నాక కారుని తాకింది.

నల్లటివేళ్ళు... ఆ మురికి ముద్రలు 'మారుతి' మీద పడే ఉంటాయి. చల్లగా అనిపించిందేమో నవ్వింది. తెల్లటి పళ్ళు... వెనక్కి తిరిగింది. దూరంగా ఇంకోపిల్ల కొంచెం పెద్దది సైగ చేసింది.

తిరిగి కళ్లలో భయం... ఆ జుట్టంతా చిందరవందరగా ఉండచుట్టిన ముళ్లకంపలా ఉంది. ఆ బట్టలు చిరిగి... ఆ శరీరం నుండి దుర్గంధం... అయినాపేరే ఓ షపి పరిమళం మెల్లగా ఆ లేత చేతులు కారు షీదకి పాకి... మల్లెదండను పుటుక్కున తెంచాయి.

"జల జల రాలిన పూలు... అలా గాలిలోనుండి భూమ్మీదికో గులాబి... ఆ తొందరలో ఒక్క రెండు మూరలు మాత్రమే తెంచుకుని పారిపోయింది.

ఎవరూ చూడనేలేదు. అందరిలోనూ ఆందోళన... ఏవరికోసమో...దేనికోసమో నిరీక్షణ...? నా భుజాలమీద చేతులేసిన 'చిట్టి' కళ్ళలో ఆశ్చర్యం..."

వాడికీ ఏవేవో జ్ఞాపకాలు... తెగిపోయిన జ్ఞాపకాలు...

ఓసారి వాడూ నేనూ... దేవుడి గుడిలో పూలకోసం పూజారిదగ్గర ఎగిరెగిరి చేతులు చాపుతుంటే...

పూలు ఆడ పిల్లలకి కదా... మీకు ప్రసాదం పెడతాను.

"కాదు అక్కకి" అంటుండగానే...మా ఇద్దరి చేతుల్లో కొబ్బరి ముక్కలు... అవంత రుచిగా లేవు... ఒక్క చిన్న చెండుపూలిస్తే అక్కతో... ఆ మైదానమంతా రాత్రిచాలాసేపు పూల పాటలు పాడుకునేవాళ్లం కదూ...!.

తిరిగి ఇంకోపిల్ల... ఇంకో వరసనుండి... కారు బోసిపోతోంది... పూలువేసి ఆ కారు ఎన్ని లక్షలైతే ఏమిటి? వెలవెలకాక... ఇంక అటు చూడటం బావ్యం కాదు. చూపి మాట్లాడనితనానికి శిక్షగా ఆ చూపులు భరించలేం. ఇంకెవరైనా ఆ పిల్లల్ని చూస్తే ఆ కళ్ళలో కనిపించే అపహాస్యాన్ని... ఆగ్రహాన్ని అసలే తట్టుకోలేం.

పూలు ఆడపిల్లలుకోసం... పిల్లలకోసం.

అవిపూలు... కోసేది పిల్లలు. పూల పిల్లలు... పిల్లపూవులు... చిట్టి మాట్లాడలేదు.

ఇంక ఎంతసేపుండాలో తెలియదు. అయితే ఇంకా మాటలు అవసరం లేదు.

ఎవరి ప్రపంచం వారికుంది. ఎవరి జ్ఞాపకాలు వారికున్నాయి మేఘంలా మాలోకి మేం తొంగి చూసుకుంటున్నాం.

ఎందుకో అనుమానం వచ్చి చూశాను. కారు వెనక భాగం ప్రమాదానికి గురైనట్లుంది. కింద పూల రెక్కలు... ఎవరూ గమనించలేదు. ఉంటే ఎంత బాధ. అందమైనవన్నీ వాడి పోవాల్సిందేనని తెలిసినా... ఆ ఆనందం కోసమే ఈ పరుగులు... భ్రమలు.....

ఎవరో ఏదో అన్నారు. ఓ కారు వచ్చి ఆగింది.

'రండిరా... ఏమిటింత ఆలస్యం' అంటున్నారు.

తిరిగి హడావుడి కెమెరాలు క్లిక్‌మంటున్నాయి. అందరి కళ్లలో సంతోషం. వీడియో లైట్ల దేదీప్యమానంగా..!

కాళ్లు కడుగుతున్నాడు కుర్రాడు...

"ఏమిటో అనుకోకుండా అయిపోయింది"

చిట్టిగాడు ఈ ప్రపంచంలో పడ్డాడు....

జనం ముందుకు కదిలారు.

సమయం తొమ్మిదికి పావుగంట తక్కువ.

ఇంక మేం కూడా వాళ్ళతోనే.... కుర్చీలన్నీ నిండిపోతున్నాయి. మొత్తం మీద మేం సీట్లు సంపాదించాం.... భోంచేస్తుంటే వచ్చాడొకాయన......

"ఏరా... అన్నయ్య వచ్చాడా?

"లేదు. నేనూ వీడే వచ్చాం" అన్నాను.

"బండి లేటయి కొంచెం ఆలస్యమైంది ఉంటూరా' 'అన్నాడు.

"లేదు. వెళ్తాం రేపు ఉదయం నగరం వెళ్లాలి".

"సర్లే. భోంచేయండి" అని వెళ్ళిపోయాడు.

తాంబూలం వేసుకొని బయటికొచ్చాం.

కారు గంభీరంగా వుంది... చిత్రకారుడి బొమ్మ నీళ్లలో తడిసినట్లు...అక్కడక్కడా కొన్ని పూలు... వేలాడుతున్న దారాలు.

"వెళ్దాం... అక్కడ సెంటర్‌లో నిలబడదాం. ఏదన్నా ఆటో వస్తే ఎక్కి వెళ్దాం" అన్నాడు చిట్టి. "గవర్నమెంట్ సిటీ బస్‌లు వస్తాయండీ- కాకపోతే అప్పుడొకటి... అప్పుడొకటి" వెనక నుండొకాయన కల్పించుకున్నాడు.

"అలాగా సార్" అన్నాడు చిట్టి.

సెంటర్‌కెళ్ళి నిలబడ్డాం.

రెండు ఆటోలు వచ్చాయి గానీ, పూర్తిగా మనుషులు...

"ఈ రోజు ఇంటికి చేరేసరికి ఏ రెండో అవుతుంది' అంటున్నాడు చిట్టి.

నా చేయి పట్టుకొని ఎవరో లాగిన భావన...



పక్కకి చూశాను...

"పూలు బాబుగారూ... రూపాయివ్వండి చాలు"

ఆ పిల్ల... అదే పిల్ల... కొనుక్కుంటున్నది తన కోసమనుకున్నా గానీ... అమ్ముకోవటానికా...

ఆ కళ్ళలో ఆశ... అంతేనా...?

"వొక్కందుకో లలితక్క గుర్తొచ్చింది." ఆమె కళ్లలో సంతోషం వెనక ఏదో బాధ... ఏమిటది? ఎందుకు?

"నీ కెక్కడివి?" గద్దించాను.

"మరి... మరి..." అంది భయపడుతూ.....

"పెళ్ళికారు నుండి తుంచి అమ్ముతున్నావ్ అవునా' 'అన్నాను.

తలవంచుకొంది.

"తల్లో పెట్టుకోకుండా... ఎందుకు అమ్ముతున్నావ్?'!

"చంటాడికి పాలు లెవ్వు... ఎవరికన్నా అమ్మి పావల డబ్బులుతే అందమ్మ" అంది

ఒక్కసారిగా నిరవం... బాధ... ఇంకేవేవో.....! ఏం చేయాలో తోచదు కొద్ది క్షణాల తర్వాత రూపాయి చేతిలో పెడుతూ-

"ఈ రూపాయి నీ తమ్ముడి పాలకి... ఇవి నీకు" అంటూ పూలనోసారి తాకి ఆ లేత చేతుల్లో ఉంచాను.

అదే నవ్వు... నల్లటి శరీరంలో కొట్టొచ్చినట్టు కనిపించే తెల్లటి పళ్లు..... జలపాతమయ్యిందా దారంట.....

గుంటూరు బస్టాండులో..! అందర్నీ నెట్టుకుంటూ చివరి సీటులో కూర్చొగలిగాం... కదిలేదాకా చెమట పరిమళం... పంట చేల షీదుగా గాలి జ్ఞాపకమూ కదిలిస్తున్నపుడు చిట్టి అన్నాడు-

" ఆ పిల్లకి నువ్వు రూపాయి ఇవ్వగలిగావ్...

పూలు పెట్టుకొనే అదృష్టం ఇవ్వగలిగావని నేననుకోవడం లేదు...."

బస్సు పరుగులు తీస్తోంది... గాలీ..... జ్ఞాపకమూ.... పూలు..... పిల్లలూ.... నాతోటే... అలా వేగంగా....!

పి. చంద్రశేఖర ఆజాద్
జీ- 5, బి- బ్లాక్, శ్రీ సాయి అపార్ట్‌మెంట్.
ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ, హైదరాబాద్ - 500 018.